www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 30 | మే | 2026
పేజీలు : 8

## సింగరేణి కార్మికుల సొంతిటి పథకం రుణం రూ.30లక్షలకు పెంచాలి

**- కంపెనీ మెయిన్ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలి**
**- మారుపేరు కేసులను పరిష్కరించాలి**
**- కాంట్రాక్ట్ కార్మికులకు క్రమబద్దీకరించాలి : కూనంనేని**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం వడ్డీలేని గృహ సహాయం రూ.10 లక్షల నుండి రూ.30లక్షలకు పెంచాలని, 250 చ.గ ఇంటి స్థలంతో కూడిన సొంత ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబ శివరావు కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సిఅండ్ ఎండి ని ఆయన శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్మికుల సుదీర్ఘ కాల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి పనులతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

మిగతా 2లో..

## పేదలను కాదని సంపన్నులకు అప్పగిస్తారా..?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిలువ నీడ లేక ఎన్నెస్పి కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుంటే బలవంతంగా తొలగించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సంపన్నులు అక్రమిస్తే ఎందుకు నోరెత్తడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక రీతి, సంపన్నులకు మరో రీతిగా చట్టంలో రాసి ఉందా అని అలా

మిగతా 2లో..

**-ఎన్నెస్పి ఆక్రమణలను తొలగించకుంటే ఆందోళన**
**-గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు ఏమైంది..?**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**-ఆక్రమణలను పరిశీలించిన సిపిఐ బృందం**



## హెచ్చరికలు బేఖాతర్..!

**-ఆగని తరగు, కోతలు**
**-మిల్లర్ల దోపిడీ.. నష్టపోతున్న రైతులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తరుగు పేరుతో కోతలు విధిస్తే మిల్లర్లపై తగు చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించినా, చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించినా మిల్లర్లు ఆ హెచ్చరికను బేఖాతర్ చేస్తున్నారు. మంత్రి, అధికారుల ప్రకటనల తర్వాత కోతల మోతాదును పెంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్వింటాకు నాలుగైదు కిలోలు తరుగు తీసే మిల్లర్లు ఇప్పుడు ఏడు నుంచి 10 కేజీల కోత విధిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మేము దిగుమతి చేసుకోం మాకు అవసరం లేదంటూ బెదిరిస్తున్నారు. ఒక్కో ఎకరానికి వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట పండించి చివరకు మిల్లర్ల ముందు సాగిల పడాల్సిన పరిస్థితి

మిగతా 2లో..

### తహశీల్దార్ కార్యాలయంలో..
## ‘ప్రైవేటు’ పెత్తనం..!

**ఇబ్బందులు పడుతున్న ప్రజలు, లబ్ధిదారులు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం మితి మీరి పోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ వివిధ సేవలు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలను ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తేనే పనులు పూర్తిగా అవుతున్నాయంటూ వారి ద్వారా మ్యామ్యాలు దండుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు 30 రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ భూములు, తనఖాలు, బహుమతి రిజిస్ట్రేషన్లు, వారసత్వ అమ్మకాలు, సెటిల్మెంట్ భూములు, వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్చుట, పలు రకాల భూములు రిజిస్ట్రేషన్ లు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 10 గంటలు వరకు వేచి చూడాల్సి వస్తుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. త్వరలో భూమి రేట్లు పెరుగుతున్నందున భూ రిజిస్ట్రేషన్‌దారులు

మిగతా 2లో..

## ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

మిగతా 2లో..

**-ఎస్ఐఆర్‌ను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి**
**-ఎస్ఐఆర్ కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష**

# పేదలను కాదని సంపన్నులకు అప్పగిస్తారా..?

(మొదటిపేజీ తరువాయి)

ఉంటే అధికారులు వెంటనే స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ స్థలాల ఆక్రమిత ప్రాంతాలలో సిపిఐ బృందం పర్యటించింది. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రదేశాల్లో యధేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుండటాన్ని పరిశీలించారు. అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఈ ఆక్రమణ దారుల్లో ఉన్నారని సురేష్ తెలిపారు. పేదల గుడిసెలను తొలగించేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్లక్ష్యంగా ఎన్నెస్పీ కాలువ కట్టలపై పేదల గుడిసెలను తొలగింపజేసిన రాజకీయ నాయకులే ఇప్పుడు స్థలాలను ఆక్రమించి షెడ్లు వేయడం శోచనీయమన్నారు. ఎన్నెస్పీ మేజర్ 2లో 66 అడుగుల వెడల్పున నాగార్జున సాగర్ కాలువ ఉన్నట్లు అధికారులు ధృవీకరించారని 12వ డివిజన్‌లో అష్టలక్ష్మి దేవాలయం ముందు భాగంలో ఓ వ్యాపారితో మొదలైన ఆక్రమణ గొల్లగూడెం రోడ్డు వెంబడి యధేచ్ఛగా సాగుతుందన్నారు. ఇప్పటికే కొందరు తమ నిర్మాణాలను పూర్తి చేయగా మరి కొందరు గతంలో ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్‌లను తొలగించి ఆక్రమణలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఇది జరుగుతుందని ఇందులో కొందరు కేవలం స్థలాల ఆక్రమణ కోసమే పార్టీలు మారారని సురేష్ ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రక



టించిన అధికారులు గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేయకపోగా ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే తిరిగి పేదల చేత ఈ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేస్తామని సురేష్ హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తెరిగి తగు చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. పరిశీలన బృందంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ నాయకులు ఉపేందర్, నర్సింహారావు, సైదులు, మధూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సొంతింటి పథకం రుణం రూ.30 లక్షలకు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం సింగరేణి మెయిన్ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చడం ద్వారా కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల కార్మికులతోపాటు ఇతర ఏరియాల కార్మికులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కొత్తగూడెంలో నూతన ఆర్టీసి బస్టాండ్ నిర్మాణానికి సిఎస్ఆర్ నిధుల నుండి రూ.14 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సంస్థలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. అధికారులు పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని, నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ చేపట్టాలని, బస్టాండ్ నుండి త్రిమాత టెంపుల్ వరకు, హెడ్ ఆఫీస్ నుండి మెయిన్ ఆస్పత్రి వరకు లైటింగ్ సంస్థ ఏర్పాటు చేయాలని, పోస్టాఫీస్ నుండి హేమచంద్రాపురం వరకు నాలుగు లైన్ల రోడ్డుగా మార్చాలని, 14వ వార్డు రామాలయం నుండి ఎన్ హెచ్ 30 వరకు రోడ్డు అభివృద్ధికి సహకరించాలని, బాబూ క్యాప్, రామవరంలో బిటి రోడ్లను సిసి రోడ్లుగా మార్చాలని, నూతన షాపింగ్ కాంప్లెక్ ఏర్పాటు చేయాలని కోరినట్లుగా తెలిపారు. లీజుల భూములను మున్సిపాలిటీకి అప్పగించాలని, ఉద్యోగుల బదిలీల అభ్యర్థనలను పరిశీలించాలని, పెర్క్స్ పై ఆదాయ పన్నును రీయింబర్స్ చేయాలని, దివంగత జెటిఓ చల్లా రాజా శ్రీనివాస్ కుమారుడు, వినికిడి లోపంగల చల్లా భరద్వాజ్‌కు కారుణ్య నియాకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరామని, తన ప్రతిపాదనలపై సిఎండి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# తహశీల్దార్ కార్యాలయంలో 'ప్రైవేటు' పెత్తనం..!

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధిదారులు త్వరపడి కార్యాలయం చుట్టూ వేచి చూడాల్సి వస్తుంది. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఒక్కో రేటు ఫైలు కో రేటు నిర్ణయించి లబ్ధిదారుల నుంచి దండుకుంటున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల పరిధిలోని కొన్ని గ్రామాల నుంచి కొందరు ప్రైవేటు వ్యక్తులు తహశీల్దార్ కార్యాలయం కు ఏజెంట్లుగా మారి వారి వద్ద నుంచి ఆపరేటర్ ద్వారా ఆ పెద్ద సార్ కి వెళ్తున్నట్లు చర్చించుకుంటున్నారు. మ్యామ్యాలు అందని వారి నుంచి ఫైలు వాయిదా వేస్తున్నట్లు సమాచారం. ఆ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులదే పెత్తనం అంటూ కల్లూరు పట్టణంలో చర్చలు కొనసాగుతున్నవి. మామూళ్ల మత్తులో ఫైలుకో రేటు ప్రైవేటు వ్యక్తి కి ఓ రేటు వారు చెప్పినే ఫైలు కదిలేది మామూలు అందని చో ఫైలు కదలక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఒకరినొకరు చర్చించుకుంటున్నారు. ఫైల్ తో పాటే కవరిస్తే సీరియల్ ముందుగా ఉంటుంది లేనిచో రాత్రి అవుతుంది ఈ విధంగా కల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇట్టి విషయమై కల్లూరు సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని, సబ్ కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# హెచ్చరికలు బేఖాతర్..!

(మొదటిపేజీ తరువాయి)

దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, తేమ పరిశీలించిన తర్వాతే కాంటాలు వేస్తున్నారని అటువంటప్పుడు కోతలు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన తర్వాత 15 రోజుల తర్వాత కానీ కాంటాలు వేయడం లేదని కాంటాలు వేసిన తర్వాత రెండు వారాలకు ఎగుమతి చేసినా కోతలు విధించడం, మిల్లర్ల దోపిడీకి నిదర్శనం. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ధాన్యం రైతులకు సంబంధించి క్వింటాకు 10 కిలోల వరకు కోత విధించారు. హన్మకొండలోని వీరభద్ర రైస్‌మిల్లుకు ఎగుమతి చేసిన ధాన్యానికి సంబంధించి పెద్ద మొత్తంలో కోతలు విధించి ఐకెపి బాధ్యులకు సమాచారం ఇచ్చారు. కొలు రైతు 126 క్వింటాళ్ల ధాన్యాన్ని ఐకెపి ద్వారా వీరభద్ర రైస్‌మిల్లుకు తరలించగా 9.46 క్వింటాళ్ల మేర తరుగు తీశారని కొలు రైతు తెలిపారు. కొందరు రైతులకు సంబంధించి 10 కిలోల వరకు తరుగు తీసినట్లు రైతులు తెలిపారు. రైతులను దోపిడీ చేస్తూ తరుగు పేరుతో దోచుకుంటున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కోతలు ఆపకుంటే ఆందోళన చేపడతామన్నారు.

**మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి : పారుపల్లి నర్సింహారావు**



ధాన్యం ఎగుమతి జరిగిన తర్వాత తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు పారుపల్లి నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన రైతులు కోతల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల వద్ద ధాన్యాన్ని, మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని నర్సింహారావు విజ్ఞప్తి చేశారు.

# వర్షాకాలంలో డ్రైనేజీల శుభ్రతకు ప్రత్యేక చర్యలు



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత ఆదేశాలతో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని మెయిన్ డ్రైనేజీల పూడిక తొలగింపు పనులు వేగవంతంగా చేపట్టారు. డ్రైనేజీల శుభ్రతకు రాజమండ్రి నుండి ప్రత్యేక కార్మికులను తీసుకువచ్చి శుక్రవారం వార్డుల్లో డ్రైనేజీ శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 11వ వార్డు కౌన్సిలర్ గద్దల మాధురితో కలిసి చైర్‌పర్సన్ పర్యవేక్షించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని ఆమె సూచించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడికను త్వరితగతిన తొలగించి శుభ్రపర్చాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ మోదుగు నాగలక్ష్మీ, గద్దల నాని, మోదుగు బాబు, రాజా పాల్గొన్నారు.

# అవినీతిని సహించేది లేదు : బిఆర్ఎస్



ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ : కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు తప్పు చేస్తే సహించేది లేదని బిఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమ టెండర్లకు బిఆర్ఆర్ఎస్ అడుగడుగున వెతిరేకిస్తామని, చెరువు మట్టిపై రూ.50లక్షలు ప్రజాధనం అక్రమార్కులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులకు మేము అడ్డుకాదని అన్నారు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్ వైవి. అప్పారావు, మధిర సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు పల్లెబోతుల వెంకటేశ్వరరావు, చిత్తారునాగేశ్వరారావు, వంకాయపాటి నాగేశ్వరరావు, నాయకులు ఉమామహేశ్వర్‌రెడ్డి, అరిగే శ్రీను, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, ఆళ్ల నాగబాబు, అబ్దుల్ కోరేశ్, పల్లెపాటి కోటేశ్వరరావు, ఆవుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విఓఎల సమ్మెకు బిజెపి మద్దతు

ప్రజాపక్షం/చింతకాని : వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ కల్పించాలని కోరుతూ చింతకాని మండల కేంద్రంలో చేపట్టిన దీక్షకు మండల బీజేపీ నాయకులు మద్దు పలికారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి మాట్లాడుతూ గత 25 ఏండ్లుగా ద్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారి అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న వీఓఏలు కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీఓఏల పాత్ర తప్పనిసరిగా ఉందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొరిపల్లి శ్రీను, గోద మంగయ్య, ఇమ్మడి సత్యనారాయణ, అంజనా సిద్దార్థ, వీఓఏలు అరుణ, ధనలక్ష్మీ, నాగరాణి, సైదులు, రాజు, నాగేశ్వరి, పుష్ప, రిజ్వానా, నాగమణి, హైమారావు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాలిక్ వెహికిల్ లిఫ్టర్‌ను ప్రారంభించిన ఎస్‌పి




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : హేమచంద్రాపురం హెడ్ క్వార్టర్స్‌లో టూ పోస్ట్ హైడ్రాలిక్ వెహికిల్ లిఫ్టర్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాకు ఏర్పడే మరమ్మత్తుల కోసం మెకానికల్ వర్క్ షాపు వద్ద ఎక్కువగా పెట్టాల్సి వస్తోందని, దానికి ప్రత్యామ్నాయంగా మోటార్ ట్రాన్స్ పోర్ట్ వర్క్‌షాపులో హైడ్రాలిక్ వెహికిల్ లిఫ్టర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని వల్ల పని వేగంగా అవడమే కాకుండా నిర్వహణ ఖర్చుకు కూడా తగ్గుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు ఆదినారాయణ, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, వెంకన్నబాబు, మల్లయ్య స్వామి, అరుణ్ కుమార్ సత్యనారాయణ, సిఐలు శ్రీనివాస్, ఓ సుధాకర్ రావు, నర్సింహారావు, లాల్‌బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బిఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు పారదర్శకత పై పనిచేయాలన్నారు. ప్రతి ఓటరును మ్యాపింగ్ చేసేవిధంగా టార్గెట్ పెట్టుకుని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నామన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని మరణించిన ఓటరు వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి రికార్డులను నవీకరించాలన్నారు. ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాముల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీ తొలగింపు జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలన్నారు. 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని సెప్టెంబర్ 28 నాటికి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని, తుది ఓటరు జాబితాను అక్టోబరు ఒకటిన ప్రచురించనున్నట్లు తెలిపారు.

అంతకు ముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పి. సుదర్శన్‌రెడ్డి ఎస్ఐఆర్ 2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ ఇతర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి రాజేశ్వరి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సారీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలను కాల్చవద్దు



### -ఏడిఏ వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పంట వ్యర్థాలు, అవశేషాలు కాల్చడం, తగలబెట్టడం వంటివి చేయవద్దని ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో రైతులకు పంట వ్యర్థాలు, అవశేషాలను తగలబెట్టడం వల్ల వచ్చేటటువంటి అనర్థాలు, వాతావరణ కాలుష్యం, భూసారం దెబ్బతినడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంట వ్యర్థాలను, అవశేషాలను తగలబెట్టకుండా రోటోవేటర్‌తో భూమిలో కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందని సేంద్రియ కార్బన్ పెరిగి పంటలకు పోషకాల లోపం లేకుండా ఉంటుందని, రసాయనిక ఎరువుల వాడకం కూడా తగ్గుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో నిగ్రణి సమితి ఏర్పాటు చేయడం జరిగిందని నిగ్రణి సమితుల ఆధ్వర్యంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించడం, ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ వంటి అంశాలను రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన వారి దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు తీసుకుని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. అవసరమైన మేరకే యూరియా, ఇతర రసాయనిక ఎరువులను వినియోగించాలన్నారు. సేంద్రియ సాగును రైతులు అవలంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, సర్పంచ్ తేజావత్ శంకర్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో సమీపంలో పంట వ్యర్థాల మంటలను గుర్తించిన ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏవో ఉమామహేశ్వరరెడ్డి సర్పంచ్ తేజావత్ శంకర్ సహకారంతో ట్యాంకర్ల ద్వారా మంటలను అదుపు చేశారు.

## పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని మంచుకొండ సొసైటీ పరిధిలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. శుక్రవారం మంచుకొండ సొసైటీ కార్యాలయం వద్ద ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ మందడపు సుధాకర్ రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన జనుములు, జిలుగు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జిలుగు 50 శాతం పూత దశలో భూమిలో కలియదున్నిట్లయితే నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి రైతులకు మేలు చేసే సూక్ష్మ జీవుల సంఖ్య వృద్ధి చెందుతుందన్నారు. తద్వారా భూమి యొక్క పోషకాలను మొక్కకు అందించేటటువంటి తత్వం పెరుగుతుందని రైతులకు సూచించారు. సొసైటీ ఛైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా సేంద్రియ కార్బన్‌ను పెంపొందించుకుని రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, సర్పంచ్ తేజావత్ శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వివోఏలు వినూత్న నిరసన



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐకెపి వివోఏల రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో భాగంగా శుక్రవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వివోఏలు వినూత్నంగా ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. కనీస వేతనం రూ. 20వేలు అమలు చేయాలని, 58జీవోను సవరించాలని, ఉద్యోగ భద్రత, హెచ్ఐఆర్ పాలసీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 12 రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తక్షణమే తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వాతి, భాస్కర్, యుగంధర్, రామారావు, సంపూర్ణ, రేణుక, ఈశ్వరి, శృతి, లలిత, ఉమారాణి, లక్ష్మి, జ్యోతి, అనురాధ, వసంత, వరలక్ష్మి, శివ, ప్రియాంక, సునీత, ఖాజాబీ, సలేహా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# యశోదలో గ్యాస్టిక్ క్యాన్సర్‌కు అరుదైన రోబోటిక్ సర్జరీ




### -ప్రముఖ రోబోటిక్ సర్జన్ శ్రీమన్నారాయణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో పిత్తాశయం క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు అడ్వాన్స్ ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీతో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ వై. శ్రీమన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతానికి చెందిన ఓ మహిళ పిత్తాశయం క్యాన్సర్‌తో బాధపడుతూ యశోద ఆసుపత్రిని సంప్రదించిందని తెలిపారు. ఆమెకు లివర్ ఫంక్షన్ టెస్టులు చేసి ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీ ద్వారా అరుదైన శస్త్ర చికిత్స అందించామన్నారు. గాలి బ్లాడర్‌లో ఎక్కువ రోజులు స్టోన్స్ ఉన్న ఈ సమస్య వస్తుందన్నారు. ప్రస్తుతం గ్యాస్ట్రిక్ క్యాన్సర్లు ఎక్కువగా ఉన్నాయని సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల, జంక్ ఫుడ్, సిగరెట్స్, మద్యపానం తో పాటు కొంత మంది వారసత్వంగా మహిళలకు, మగవారికి అందరికీ వస్తుందన్నారు. వారసత్వంగా వచ్చే క్యాన్సర్‌లు ఈ జనరేషన్ వారికి కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కొంత మంది ఫాస్టింగ్ చేసి వెయిట్ లాస్ అయ్యే వారికి ఫ్యామిలీ హిస్టరీ ఉన్న వారికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వారసత్వ క్యాన్సర్‌కు సంబంధించి పదేళ్ల ముందే రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేసుకోవాలని, ఐదేండ్లకొకసారి ఎండోస్కోపి, రెగ్గర్ ఆల్ట్రా సౌండ్ టెస్టులు చేసుకుని కంట్రోల్ చేసుకోవచ్చునన్నారు. తరచూ కడుపునొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, వాంతులు అవ్వడం వంటి లక్షణాలు ఉంటే అడ్వాన్స్ స్టేజీలో ఉందని వెంటనే వైద్యున్ని సంప్రదించాలన్నారు. పేగు సర్జరీ చేస్తే మూడు నుంచి నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని తెలిపారు. గాలి బ్లాడర్ క్యాన్సర్ ఎంతో ప్రమాదమని బయట ఆహారాన్ని తగ్గించాలని, నిద్ర మంచిగా పోవాలని, ఎక్కువ ఒత్తిడికి గురి కాకూడదని, మానసికంగా, ప్రశాంతంగా ఉండాలన్నారు. హైదరాబాద్ సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో అడ్వాన్స్ కీమోథెరపి, రేడియో థెరపి, అన్ని విభాగాల క్యాన్సర్లకు అతి తక్కువ ఖర్చుతో అత్యాధునీక వైద్యం అందుబాటులో ఉందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రావు, నాగార్జున, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఉచిత మెగా హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 31న ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చారా రాము శుక్రవారం తెలిపారు. ఖమ్మం నగరంలోని స్వర్ణ భారతి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, నేత్ర, చర్మ వ్యాధులు, ఈఎన్‌టి, స్త్రీ వ్యాధులు, శిశు వైద్యం, యూరాలజీ, న్యూరో, సైకియాట్రీ తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు వైద్య సేవలను అందిస్తారని తెలిపారు.రక్త పరీక్షలు, షుగర్, బిపి, ఈసిజి, ఎక్స్‌రే, మామోగ్రామ్ వంటి పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజసేవలో భాగంగా నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు అవసరమైన వైద్య సలహాలు, పరీక్షలు పొందెందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందన్నారు.

# చారిత్రక ఉద్యమంలో భాగస్వామ్యమే సిపిఐ సభ్యత్వం

### బ్రాహ్మణపల్లిలో సిపిఐ సభ్యత్వ కార్యక్రమం విజయవంతం
### -సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ



**ప్రజాపక్షం/ఖమ్మం:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) సభ్యత్వం అనేది ఒక రాజకీయ అనుబంధం మాత్రమే కాదని, అది కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే ఒక చారిత్రక ఉద్యమంలో భాగస్వామ్యం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దేశంలో సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో సాగించిన ప్రజాపోరాటాల ద్వారా సాధించిన విజయాల స్ఫూర్తితో భవిష్యత్‌లో ప్రజల హక్కుల కోసం పోరుబాటలో ముందుకెళ్తామని అన్నారు. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై సిపిఐ ఆవిర్భవించిందని తెలిపారు. భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. దేశంలో భూసంస్కరణలు, కార్మిక హక్కులు, అనే సంక్షేమ పథకాలు కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా వచ్చాయని గుర్తు చేశారు. పేదలు, దళితులు, మైనార్టీలు, బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రజల హక్కుల సాధన కోసం సిపిఐ నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులు నేటికి పూర్తిగా అమలుకావడం లేదని, నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల రాకముందు, అనంతరం మొత్తంగా పెట్రోల్, డిజిల్ 4 సార్లు పెంచి సామాన్యుల నడ్డివిరిచాడని ఎద్దేవా చేశారు. మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని, విభజన, విద్వేష రాజకీయాలలో బిజేపీ దేశ సమగ్రతకు సవాల్‌గా మారిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, కార్పోరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగిపోయి దేశ సంపద కార్పోరేట్ల జేబుల్లోకి వెలుతుందన్నారు. ఆయా సమస్యలపై సిపిఐ నిర్మాణాత్మక ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీలో, సభ్యత్వం ద్వారా ఒక వ్యక్తి భావజాలం, సిద్ధాంతం, సమాజ మార్పుపై స్పష్టత పొందేందుకు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి గుడిద కృష్ణ, ఉపసర్పంచ్ ఏలూరి రమేష్, సహాయ కార్యదర్శి చావా గోపాలకృష్ణ, మాజీ ఎంపిటిసి కొంగర రామారావు, సిపిఐ మండల నాయకులు మడుపల్లి వెంకటేశ్వరరావు, మందడపు కృష్ణయ్య, వంగాల హనుమంతరావు, పారుపల్లి నరసింహారావు, పారుపల్లి జోగారావు, గుడిద సత్యం తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు బోజడ్ల వెంకయ్య మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని మంగళగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు బోజెడ్ల వెంకయ్య(95) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా భౌతికకాయాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తి , సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పగిళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంవి.పాలెంలో మోడీ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ.పాలెంలోని ఖమ్మం మహబూబాబాద్ రహదారిపై ప్రధాని మోడీ దిష్టి బొమ్మను సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం దగ్ధం చేశారు. దీనిని పెంచిన పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని మాస్‌లైన్ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసనగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు, నాయకులు కుర్ర వెంకన్న, ఎడ్లపల్లి ఉపేందర్, రెంటాల యాదగిరి, వీర్ల వెంకటఅప్పారావు, మాధవరావు, మహంకాళి ఉప్పలయ్య, కూసు మోహన్‌రెడ్డి, కందుల స్వామి, తోకల పెద్ద వెంకన్న, భయ్యా శ్రీనివాసరావు, కొత్త రమేష్, అక్కి వెంకన్న, అవిరేని వెంకన్న, గుమ్మడి వీరబాబు, కే. రమేష్, భోగి సత్యం, దరిపల్లి లక్ష్మయ్య, తోకల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజకవర్గ విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధి లక్ష్యంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చిరునామాగా నిలిచారు. సుమారు రూ. 5 కోట్ల 10 లక్షల నిధులతో మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించారు. నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణం ప్యూర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు నూతన తరగతి గదుల నిర్మాణం సీసీ రోడ్ల నిర్మాణం కళాశాల మౌలిక వసతుల అభివృద్ధి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పలు సదుపాయాల కల్పనవిద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా, విద్యా ప్రమాణాల పెంపుకై నిరంతరం కృషి చేస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సేవలను విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు అభినందిస్తున్నారు. ఎమ్మెల్యే విద్యాభివృద్ధే సమాజాభివృద్ధికి పునాది అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

## చిక్కుడు గుంట గ్రామాన్ని అభివృద్ధి చేయండి



**ప్రజాపక్షం/మణుగూరు:** చిక్కుడు గుంట గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని శుక్రవారం సిపిఐ పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిక్కుడు గుంట మాజీ ఎంపిటీసీ కామిశెట్టి రామారావు మాట్లాడుతూ గ్రామంలో నెలకొని ఉన్న అంతర్గత రోడ్లు, సైడ్ కాలువలు, సైడ్ డ్రైనేజీలు. మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే చిక్కుడు గుంట గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని, అభివృద్ధికి చేసి చూపిస్తామని వారు హామీ ఇచ్చారనీ వారు అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిపిఐ, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, మాజీ సర్పంచ్ కుర్సా రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, మేడ రామారావు,తంత్రపల్లి శోభన్, అలవాల సత్యం,బత్తరామరావు, మునిగేల లక్ష్మణ, గుమ్ముల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయంపై అవగాహన



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని రావిచెట్టు తండా గ్రామంలో డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ)సతీష్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నాలని, నిషేధిత హెచ్ టీఈ పత్తి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే నకిలీ విత్తనాలు, విచక్షణా రహిత ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో ఎరువుల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి రాముడు మాట్లాడుతూ తగిన వర్షపాతం నమోదైన తర్వాతే పత్తి విత్తనాలు విత్తాలని, పొడి వాతావరణంలో విత్తితే మొలక శాతం తగ్గి రైతులకు నష్టం కలుగుతుందని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

## మోదుగు పెదవీరయ్యకు ఘన నివాళి



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలానికి చెందిన ప్రముఖ వృద్ధుడు మోదుగు పెదవీరయ్య మరణంతో ఆయ న కుటుంబ సభ్యులు నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రా మ పెద్దలు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మోదుగు పెదవీరయ్య కుమారుడు, హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మోదుగు రాము, అతని సోదరుడు మోదుగు అంజయ్యల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి మాజీ ఎంఎల్ఏలు సండ్ర వెంకట వీరయ్య, బొల్లం మల్లయ్య యాదవ్ హాజరై పెద వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు, మండలంలోని పలువురు సర్పంచులు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు పెద వీరయ్య సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామాభివృద్ధి, సామాజిక సేవల పట్ల పెదవీరయ్య చూపిన నిబద్ధత చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# అర్ధరాత్రి విగ్రహాల తొలగింపు..!

**ఆర్అండ్‌బి శాఖ అత్యుత్సాహమేనా...?**
**-ఒక్క షోకాజ్ నోటీసుతోనే కూల్చివేతలా..?**
**-రాజకీయ ఒత్తిడులా..అధికారుల హడావుడా..?**
**-మండలంలోని దళిత సంఘాల ఆవేదన**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, దొడ్డి కొమురయ్య విగ్రహాల తొలగింపు వ్యవహారం రోజురోజుకు మరింత వివాదాస్పదంగా మారుతోంది. ముఖ్యంగా ఒక్క షోకాజ్ నోటీసు ఇచ్చిన వెంటనే అర్ధరాత్రి సమయంలో భారీ పోలీసు బందోబస్తుతో విగ్రహాలను తొలగించడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. ఇది నిజంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగిందా లేక అధికారుల అత్యుత్సాహ నిర్ణయమా అనే ప్రశ్నలు ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఏళ్ల తరబడి అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహాలు ఒక్కసారిగా అధికారులకు అడ్డంకులుగా కనిపించడం వెనుక రాజకీయ ఒత్తిడులున్నాయా లేక పైస్థాయి అధికారుల ఆదేశాలా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకుండా చర్చలు జరపకుండా అర్ధరాత్రి సమయంలో తొలగింపులు చేపట్టడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు కోట్లాది అణగారిన వర్గాలకు ఆత్మగౌరవానికి ప్రతీక. సమాన హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు, అలాంటి వ్యక్తి విగ్రహాల విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఒక్క షోకాజ్ నోటీసుతో విగ్రహాలు తొలగించవచ్చా....?**

కొంత మంది న్యాయనిపుణులు, సలహాదారులు అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ భూముల్లో లేదా రహదారి విస్తరణలో భాగంగా విగ్రహాలను తొలగించాల్సి వచ్చినా అందుకు స్పష్టమైన విధివిధానాలు ఉన్నాయని, కేవలం ఒక షోకాజ్ నోటీసు ఇచ్చి వెంటనే విగ్రహాలను తొలగించడం సాధారణ పరిపాలనా పద్ధతికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో అధికారులు ముందుగా సంబంధిత కమిటీ లేదా నిర్వాహకులకు లిఖితపూర్వక నోటీసులు ఇచ్చి సమాధానం ఇవ్వడానికి తగిన గడువు కల్పించాలి, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తే బాగుంటుందని కొంత మంది అభిప్రాయం కానీ అశ్వాపురంలో జరిగిన ఘటనలో ఈ ప్రక్రియ పూర్తిగా పాటించారా లేదా అన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క నోటీసు ఇచ్చి వెంటనే అర్ధరాత్రి పోలీసులతో వచ్చి విగ్రహాలు తొలగించడం ఏ నిబంధనల్లో ఉంది అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**రోడ్ల గుంతలు కనిపించవా...విగ్రహాలే కనిపించాయా....?**

అశ్వాపురం మండలంలో రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల వెలుతురు లేక ప్రమాదాలు జరుగుతుతన్నాయి. డివైడర్లు ధ్వంసమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కానీ ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ సమస్యలపై స్పందించిన ఆర్అండ్‌బి శాఖ విగ్రహాల తొలగింపులో మాత్రం అసాధారణ వేగం ప్రదర్శించడం ప్రజలను ఆగ్రహానికి గురి చేస్తోంది. ఆనాడు విగ్రహాలు ఏర్పాటు చేసినప్పుడు అధికారులు ఎక్కడ ఉన్నారు. అప్పట్లో నిబంధనలు గుర్తుకు రాలేదా...ఇప్పుడు ఒక్కసారిగా చట్టం పేరుతో హడావుడి ఎందుకు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల మనోభావాలతో ఆటలాడొద్దు అంబేద్కర్ విగ్రహం అంటే కేవలం ఒక శిల్పం కాదు, కోట్లాది ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నం అంటి అంశాల్లో అధికారులు మరింత సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజా సమస్యలను పక్కన పెట్టి అర్ధరాత్రి సమయంలో పోలీసు బలగాలతో విగ్రహాలు తొలగించడం ద్వారా ఆర్అండ్‌బి శాఖ ప్రజల్లో మరింత అనుమానాలకు తావిచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది అధికారుల అత్యుత్సాహమా రాజకీయ ఒత్తిడుల ఫలితమా లేక ప్రజల మనోభావాలను పట్టించుకోని పరిపాలనా నిర్లక్ష్యమా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు అధికారులపై ఉందని అశ్వాపురం ప్రజలు, దళిత సంఘాలు అంటున్నారు.

# సేవలకు సెల్యూట్

**-సీడీపీఓ సలోమికి భావోద్వేగ వీడ్కోలు**
**-మహిళా, శిశు సంక్షేమానికి విశేష సేవలు అందించిన అధికారిణికి ఘన సన్మానం**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ డి సలోమి పదవీ విరమణ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు ఆప్యాయతాభరిత వాతావరణంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నో సంవత్సరాలుగా మహిళా, శిశు సంక్షేమ రంగంలో విశిష్ట సేవలందించిన ఆమెకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ డి సలోమి తన సేవాకాలంలో అంకితభావంతో పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం, పోషకాహార కార్యక్రమాల అమలులో ఆమె చూపిన చొరవ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ సభలో మాట్లాడిన డి సలోమి తన విధి నిర్వహణలో సహకరించిన సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని అన్ని సెక్టార్లలో పని చేసే సిబ్బంది సహకారంతోనే ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగానని అన్నారు. ఇంత మంది ప్రేమాభిమానాల మధ్య పదవీ విరమణ చేయడం ఒకవైపు ఆనందంగా ఉన్నా, మరోవైపు కుటుంబ సభ్యులను విడిచిపెడుతున్న భావన కలుగుతోందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు మహాలక్ష్మి, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, భారతి, కుమారి, లావణ్య, అరుణ, పుష్ప, వరలక్ష్మి, సుభద్ర, నరసమ్మ, రమాదేవి, రాధతో పాటు ఇతర సిబ్బంది పాల్గొని సలోమికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు.. నేలలో కలియదున్నండి



**ప్రజాపక్షం/పినపాక:** పంట పొలాల్లో వరిగడ్డి, మొక్కజొన్న చెత్తతో పాటు ఇతర వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా నేలలో కలియదున్నాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఎం నాగేశ్వరరావు రైతులకు సూచించారు. శుక్రవారం జానంపేట గ్రామ రైతు వేదికలో సర్పంచ్ పూనెం ఉమామహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన రైతు అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం తగ్గడంతో పాటు వానపాములు, మిత్ర పురుగులు, పశుపక్షులకు నష్టం జరుగుతుందని తెలిపారు. వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ పదార్థం పెరిగి నేల సారవంతమైన దిగుబడులు మెరుగుపడతాయని చెప్పారు. జీవో నెంబర్ 27 ప్రకారం పంట వ్యర్థాలను కాల్చిన రైతులకు రూ 5వేల నుంచి రూ 25వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. రానున్న వానాకాలంలో ప్రభుత్వం సూచించిన సన్న రకాల వరి విత్తనాలనే సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈసందర్భంగా రైతులు పంట వ్యర్థాలను కాల్చబోమని తీర్మానం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఖాజా హుస్సేన్, ఉప సర్పంచ్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశించినా.. కదలని ఫోర్‌వే పనులు..!

**-పెండింగ్ బిల్లులే కారణమంటున్న గుత్తేదారు**
**దుమ్ముతో ఉక్కిరిబిక్కిరవుతున్న గ్రామస్తులు**







**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఫోర్ వే రోడ్డు నిర్మాణ పనులు ప్రజలకు వరంగా కాకుండా శాపంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల క్రితం ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు, మరో వైపు రహదారిపై ఎగిసిపడుతున్న దుమ్ముతో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. గ్రామం గుండా వెళ్లే ప్రధాన రహదారిని ఫోర్ వేగా విస్తరించే పనుల్లో భాగంగా పాత రోడ్డును తొలగించినప్పటికీ కొత్త రోడ్డు నిర్మాణం మాత్రం నత్తనడకన సాగుతోంది. భారీ వాహనాల రాకపోకలతో రహదారి మొత్తం దుమ్ముతో నిండిపోతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దుమ్ము మేఘాలు కమ్ముకుంటుండటంతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ స్వయంగా సమస్యను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకున్నప్పటికీ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు గుత్తేదారు మాత్రం పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని చెబుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తేనే మిగిలిన పనులు పూర్తి చేయగలమని ఆయన పేర్కొంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో అటు అధికారుల అలసత్వం, ఇటు గుత్తేదారి వైఖరి మధ్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కాలుష్యం కారణంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దగ్గు, జలుబు, అలర్జీ వంటి సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రహదారి పక్కన ఉన్న వ్యాపారులు కూడా దుమ్ము కారణంగా వ్యాపారం దెబ్బతింటోందని వాపోతున్నారు. నిర్మాణ సంస్థ ప్రతి రోజూ రోడ్లపై నీళ్ల చల్లి దుమ్ము నియంత్రించాల్సి ఉన్నప్పటికీ ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు వెళ్లిన ప్రతిసారి దుమ్ము భారీగా ఎగసిపడుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఫోర్‌వే రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, రోజువారీగా నీళ్ల చల్లి దుమ్ము నియంత్రించాలని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి పనులు పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరుతున్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

**- ఏఐటీయుసీ ఆధ్వర్యంలో అర్ధ నగ్నంగా ఆటోలను లాగుతూ విన్నూత నిరసన**
**- ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయుసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ఆటో కార్మికులు శుక్రవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి బస్టాండు సెంటర్ వరకు అర్ధ నగ్నంగా ఆటోలకు తాడుకట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న ఆటో కార్మికులపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోయలేని భారం మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కార్పోరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేదలను నట్టేట ముంచుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు డీజిల్ ధర పెంచి ఆటో కార్మికుల నడ్డివిరిచారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. లాక్‌డౌన్ కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆటో కార్మికులను ఈ ధరల పెరుగుదల మరింత కుంగదీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాలను తగ్గించి, కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మ్రరి కృష్ణ, అబ్బులు, మంద శ్రీను, బాబు జానీ, ఆరెల్లి, కృష్ణ, రాంబాబు, దేశి, బడుగు భాస్కర్, చింటూ, లక్ష్మణ్, సంపత్, విజ్జి, మండల రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వెంగన్నపాలెం ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు..!



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ (దళితవాడ) తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. మండల కేంద్రానికి అత్యంత సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్నప్పటికీ ఈ కాలనీపై అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం కాలనీ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన మూడు చేతి పంపులు (హ్యాండ్ బోర్లు) కొన్ని సంవత్సరాలుగా పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ఒక్క బోర్ కూడా పనిచేసే పరిస్థితి లేకపోవడంతో స్థానిక ప్రజలు చుక్కనీటి కోసం నానా అగచాట్లు పడాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుతం రోహిణి కార్తె ప్రవేశించడంతో ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. ఒకపక్క భానుడి భగభగలు, మరోపక్క మిషన్ భగీరథ నీరు కూడా సక్రమంగా సరఫరా కాకపోవడంతో కాలనీవాసుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. కాలనీలో ఏ చిన్న శుభకార్యం జరిగినా, చివరకు దశదిన కర్మల వంటి కార్యక్రమాలకు కూడా నీటి కోసం దూర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నీటి కోసం వెంగన్నపాలెం పంచాయతీ పాలకవర్గానికి, ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే తమకు ఈ దుస్థితి వచ్చిందని దళితవాడ ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ నీటి కష్టాలు ఎప్పటికైనా తీరతాయా అనేది ఇప్పుడు కాలనీలో ఒక మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ఎస్సీ కాలనీలో నూతన హ్యాండ్ బోర్లను ఏర్పాటు చేసి తమ దాహార్తిని తీర్చాలని కాలనీవాసులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## వీవోఏల సమ్మెకు బీసీ సంక్షేమ సంఘం మద్దతు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత రెండు వారాలుగా నిరవధిక సమ్మె చేపట్టిన ఐకేపీ వీవోఏలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించింది. శుక్రవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాసరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి వీవోఏల మోకాళ్లపై నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా భూపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కీలక సేవలు అందిస్తున్న వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వీవోఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హత, సీనియారిటీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించి సీసీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీవోఏలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయమైనా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వీవోఏల జాయింట్ యాక్షన్‌కమిటీ నాయకులు, మండలకమిటీప్రతినిధులు,వీవోఏలు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో కారేపల్లి మండలం ఓసీ వద్ద ఇల్లందు, ఖమ్మం ప్రధాన రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. మాస్‌లైన్ మండల కార్యదర్శి, సర్పంచ్ గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి టీ ఝాన్సీ, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యుడు గుగులోత్ తేజ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, రవాణా, వ్యవసాయ ఇన్‌పుట్ల ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాస్‌లైన్ నాయకుడు ఎన్‌వీ రాకేష్, మండల నాయకులు ధరావత్ సక్కు, అంబటి వెంకటేశ్వర్లు, పీవైఎల్ గ్రామ కార్యదర్శి బానోత మోహన్, గుమ్మడి ఎర్రయ్య, దోమల సీత, గుమ్మడి ముత్తయ్య, గుమ్మడి కిరణ్, కొడెం రమణ, చింత కవిత, తాటి సుమిత్ర, గుగ్గల రాంబాబు, గుమ్మడి గోపాల్, జోగు నాగేశ్వరరావు, గుమ్మడి రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** గ్రామ అభివృద్ధికి మరో అడుగు పడింది. రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి నిధులతో పొలంపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ హేమలత బాలాజీ పుజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ హేమలత బాలాజీ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదకరికి, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సంజీవ్ కుమార్, శివరామ్, రమేష్, ఉప సర్పంచ్ గుగులోత్ సర్వాన్, మాజీ సర్పంచులు దారావత్ భద్రూనాయక్, అలెం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుగులోత్ నవీన్, కాంగ్రెస్ నాయకులు భూక్యా భద్రు, వినాయక ప్రభాకర్, మునీరం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు గుగులోత్ కళ్యాణ్, జగ్యా, కూన, మూతి కోటయ్య, తాటి పాపారావు, గ్రామ పంచాయితీ కార్యదర్శి మోహన్, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఆర్గానిక్ మేళాలో భద్రాద్రి మిల్లెట్స్




**ప్రజాపక్షం/భద్రాచలం :** హెచ్ఎంటివి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో భద్రగిరి మార్ట్, మిల్లెట్ మ్యాజిక్ స్టాల్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఐమాక్స్ థియోటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ నిత్యవసర సరుకులు, మిల్లెట్ బిస్కెట్లు, జిసిసి ఉత్పత్తులు, ఆర్గానికి వ్యవసాయ ఉత్పత్తులు, ఎస్‌హెచ్‌జి గ్రూపులు తయారు చేసిన ఇతర ఆహార పదార్థాలు స్టాల్‌లో ఉంచారు. వీటిని చూసిన పలువురు ఆసక్తితో పెద్ద మొత్తాల్లో కొనుగోలు చేసినటు ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. స్టాల్ ఏర్పాటు చేసిన వారిలో భద్రగిరి మార్ట్ సిబ్బంది శివ, మంగవేణి, సమ్మక్క, లలిత తదితరులున్నారు.

# ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి




**- గంజాయి స్పాట్ లపై ప్రత్యేక నిఘా : ఎస్‌పి రోహిత్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, గంజాయి స్పాట్‌లపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు ఎస్‌పి రోహిత్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కేసులో దర్యాప్తు సమగ్రంగా జరగాలని, నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేసే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్‌ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బాధితుల ఫిర్యాదు చేసిన వెంటనే తక్షణమే స్పందంచాలని సూచించారు. డయిల్ 100కు ఫోన్ రాగానే త్వరితగతిన స్పందించి బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. పెండింగ్‌లోఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# గని ప్రదేశాల్లో కార్మికులకు వసతులు,సదుపాయాలు కల్పించాలి

**- కార్మిక సమస్యలపై యాజమాన్యంతో గుర్తింపు సంఘం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గని ప్రదేశాల్లో కార్మికులకు వసతులు, సదుపాయాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఏఐటియూసి) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పీవీకే 5 ఇంక్లైన్‌లో మైన్స్ కమిటీ సమావేశం పిట్ కార్యదర్శి బూక్యా రమేష్ నాయకత్వంలో జరిగింది. ఈ సందర్భంగా గని ప్రదేశాల్లో ఉన్న మౌళిక సదుపాయాల లోపాలు, భద్రతా అంశాలు, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై నాయకులు యాజమాన్యంతో చర్చించారు. నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తగిన సంక్షేమం, సదుపాయాలు కల్పించండం యాజమాన్య బాధ్యత అని స్పష్టం చేశారు. కార్మికుడు ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉంటే విధులకు క్రమం తప్పకుండా హాజరవుతారని సంస్థ ఉత్పత్తి సాధనకు కృషి చేస్తారమని చెప్పారు. గని ప్రదేశాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మైన్స్ కమిటీ సభ్యులు గని మేనేజర్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. వచ్చే దారిలో వర్షా కాలంలో నీరు నిలిచిపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, స్నానాల గదులు, కార్మికులు ఉపయోగించే సాధారణ ప్రదేశాల్లో ప్రతీ రోజు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని, కార్మికులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల భద్రత, సంక్షేమ కోసం యాజమాన్యం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్యామ్ ప్రసాద్, ఎస్‌ఓ అనీల్ సాగర్, కామన్ సెక్షన్ ఇంచార్జ్ శ్రావణ్, యాక్టింగ్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్, మైన్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సందీప్, సుమన్, సురేందర్ రెడ్డి, దేవ్ సింగ్, కే రామ్‌చందర్, శశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఏఐటియుసి గుర్తింపు కార్మిక సంఘంతో ఏరియా మేనేజ్మెంట్ స్ట్రక్చర్ సమావేశం




**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి గుర్తింపు కార్మిక సంఘంతో మణుగూరు ఏరియా మేనేజ్మెంట్ స్ట్రక్చర్ సమావేశం మణుగూరు ఏరియా జిఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్ సమస్యలను ప్రస్తావించారు. స్థానిక సింగరేణి చెక్పోస్ట్ వద్ద రహదారి ప్రమాదకరంగా ఉందని రోడ్డును సరి చేసి కార్మికులు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని కోరారు. తీవ్రమైన వేసవి ఎదుర్కొంటున్న కార్మికులకు పనివేళలో తగిన విశ్రాంతి నివ్వాలని కోరారు. కే సి హెచ్ పి లో డస్ట్ కంట్రోల్ చేయాలని, సరిపడా రా వాటర్ ని సరఫరా చేయాలని కోరారు. పివి కాలనీలో కార్మికుల ఆరోగ్యాలను ప్రభావితం చేస్తున్న ఏడు ఆకుల చెట్లను తొలగించాలని కోరారు. మణుగూరు ఏరియాలో ఖాళీగా ఉన్నటువంటి అన్ని వేకెన్సీలను భర్తీ చేయాలని కోరారు. మణుగూరుఏరియాలో సింగరేణి కార్మికులు సూపర్ బజార్ ద్వారా గ్యాస్ డోర్ డెలివరీ కాకుండా కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని వెంటనే గ్యాస్ డోర్ డెలివరీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మణుగూరు ఏరియాలో ఉన్నటువంటి ఓబి కంపెనీలలో 80% స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సింగరేణి కార్మికుల పిల్లలకు, ల్యాండ్ లూజర్లకు, స్వయం ఉపాధి వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సింగరేణి ఏరియా హాస్పిటల్ లో పర్మినెంట్ గైనకాలజిస్ట్ నియామకం చేపట్టాలని, రిఫరల్ హాస్పిటల్ లో డాక్టర్ రాసిన మెడిసిన్స్ ఏరియా హాస్పిటల్ లో అందుబాటులో ఉంచాలని కోరారు. పై సమస్యలను మేనేజ్మెంట్ ముందు ప్రస్తావించడం జరిగిందని యాజమాన్యం సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిందని కెసిహెచ్‌పి ఎంట్రన్స్ వద్ద రోడ్డు మరమ్మత్తులను చేపట్టాలని, కెసిహెచ్‌పి లో త్వరలో డస్ట్ సస్పెన్షన్ సిస్టం పూర్తి చేయాలని, అదనంగా ఇంకొక వాటర్ లైన్ ని ఏర్పాటు చేయాలని జిఎం ఏఐటియుసి నాయకులు అడగడంతో వెంటనే అధికారులకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించడం జరిగిందని అన్నారు. ఈ స్ట్రక్చర్ సమావేశంలో మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఏజిఎం పర్సనల్ సెలగల రమేష్, ఎస్ టూ జిఎం బి శ్రీనివాస చారి, ఏరియా ఉన్నతాధికారులు, ఏఐటీయూసీ జిఎం కమిటీ మెంబర్స్ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆవుల నాగరాజు పాల్గొన్నారు.

# వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం మండల మహాసభ




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రామచంద్రాపురం గ్రామంలో తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం 7వ మండల మహాసభ పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు, పద్దం సుగుణల అధ్యక్షతన జరిగింది. మహాసభల ప్రారంభ సూచికగా సంఘం జెండాను కొడెం బక్కులు ఆవిష్కరించారు.

**నూతన మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం..**

తెలంగాణ వ్యవసాయ గ్రామీణ, కార్మిక సంఘం 7వ మహాసభలో నూతన మండల అధ్యక్షులుగా యాసా నరేష్, కార్యదర్శిగా రాచబంటి కోటేశ్వరరావు, మండల మహిళా కన్వీనర్ గా పద్దం సుగుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రకటించారు, వీరితోపాటు నూతన మండల కమిటీ సభ్యులుగా పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు, ఇల్లంగి సీతారాములు, తోలెం సరస్వతి, గుగులోత్ నర్సింహారావు, తాటి క్రిష్ణవేణి, బానోత్ క్రిష్ణ, ఊడల వెంకటేశ్వర్లు, తాటి ఇందిర, వేముల ఉపేందర్, ఎలగల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం జూలూరుపాడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో పరిశీలించారు. ఈ సందర్భంగా గత రాత్రి కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న నిల్వలు తడిసాయా అనే అంశంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లతో పటిష్టమైన రక్షణ చర్య లు చేపట్టడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న నిల్వలను, నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని, ఈరోజే మొత్తం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిన్న ఎన్ని లారీలు లోడింగ్ చేశారో, ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో మొక్కజొన్నను గోదాములకు తరలించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 28 వేల బస్తాలను గోదాములకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు



**ప్రజాపక్షం/పినపాక:** కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకుని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరిస్తూ పార్టీకి చెడ్డపేరు తెచ్చే వారిని ఉపేక్షించబోమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, పినపాక మండల అధ్యక్షుడు రామనాథం హెచ్చరించారు. కాంగ్రెస్ ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి బోడ రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించిన నాయకులకే మండల అధ్యక్షులుగా గుర్తింపు ఉందని, తమను తాము అధ్యక్షులుగా ప్రచారం చేసుకోవడం పార్టీ విధానాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలను, అధికారులను, కార్యకర్తలను బెదిరించే చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారమే కాంగ్రెస్ నాయకుల లక్ష్యమని తెలిపారు. పార్టీ క్రమ శిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై అధిష్టానం తగిన చర్యలు తీసుకుటుందని అన్నారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు కొంబత్తిని శ్రీనివాసారావు, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, ఉప్పాక సర్పంచ్ బాబురావు, ఉప్పాక ఉప సర్పంచ్ కోడెం రామ్‌మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు సంపత్, మార్తా మనోజ్, నక్కల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** పెరటి కోళ్ల పెంపకం నిధులు మంజూరు శుక్రవారం స్వయం శక్తి మండల మహిళా సమాఖ్య పరిధిలో ని 27 గ్రామసమాఖ్య ల లోని సంఘాల సభ్యులు 275 మందికి రూ. 5.50 లక్షలు నిధులు పెరటి కోళ్ల పెంపకం కొరకు మంజూరు చేయుట జరిగింది. దీనికి సంబందించిన నిధులు చెక్కును స్థానిక తెలంగాణ గ్రామీణ బాంకు లో సమాఖ్య సభ్యులకు పంపిణీ చేయుట జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపిఎమ్ బండి వినోద్ క్రాంతి, బ్రాంచి మేనేజర్ ఎన్ గిరిబాబు, సీసీ లు పోలేబోయిన విజయలక్ష్మి , సత్యనారాయణ,అకౌంటెంట్ ప్రీతీ,సమాఖ్య ప్రతినిధులు మహేశ్వరి పాల్గొన్నారు.

# పేదోని వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

**- ఏరియా ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి**

**- సిపిఐ(ఎం) ప్రతినిధి బృందం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** పేదోని వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ప్రభుత్వం ఏరియా ఆస్పత్రికి సరిపడా సిబ్బందిని కేటాయించి సమస్యలు పరిష్కరించాలని సిపిఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వం ఏరియా ఆస్పత్రిలో కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ఆస్పత్రికి 62 మంది వైద్యుల అవసరం ఉండగా కేవలం 21 మందితో మాత్రమే విధులు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారని, తద్వారా పేదవారికి సరైన వైద్య సమయానికి అందడం లేదన్నారు. పని ఒత్తడి కారణంగా ఇక్కడి విధులు నిర్వహించేందుకు వైద్యులు ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదని, ఆరోపించారు. స్థానిక ఎంఎల్‌ఏ స్వయానా డాక్టర్ అయినప్పటికీ ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షాలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ 200 పడకల ఆస్పత్రిగా ఉన్న ఈ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలిన చేశామని, కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనసూయ, పారిల్లి సంతోష్ కుమార్, సీతాలక్ష్మి , నాదెండ్ల లీలావతి, రాఘవయ్య, కనక శ్రీ, రామకృష్ణ, వెంకన్న, రవీంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రోజురోజుకు పెరుగుతున్న కాల్వ ఆక్రమణ..!



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దిపూడి గ్రామం సమీపంలోని 81 సర్వే నెంబర్ గుట్ట ప్రక్కన ఉన్న ప్రభుత్వ కాల్వ ఆక్రమణకు గురవుతుంది. ఈ కాల్వ వ్యవసాయ పనుల కోసం ఎన్ఎస్పి కాల్వ నుండి నీరు వచ్చేందుకు ఏర్పాటు చేసిన కాల్వ. కాని ప్రభుత్వం కొంతమంది వారి స్వార్ధాలకు కాల్వను పూర్తిగా రెండు ప్రక్కల ఆక్రమణకు గురి చేసుకుంటున్నారు. ఎన్ఎస్పి కాల్వ క్రమేణా కనుమరుగవుతుందని చెప్పవచ్చును. రైతుల అభివృద్ధి కోసం అన్నదాతలకు అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఎన్ఎస్పి కాల్వ పూర్తిగా ఆక్రమించుకున్నారని చెప్పవచ్చును. వైరా మున్సిపాలిటీలో ఎన్ఎస్పి భూములకు రక్షణ లేకుండా పోయింది.ఒకపక్క మున్సిపాలిటీ పరిధిలో వైరాలో ఎన్ఎస్పి కాల్వ ఆక్రమణలకు గురికావడంతో పాటు అక్రమ కట్టడాలు చేపట్టారు. పంట పొలాలకు నీరు అందించే కాల్వను దిద్దిపూడి సమీపంలో ఆఆక్రమమించుకున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను కబ్జా చేసిన చర్యలు తప్పవని పలుసార్లు ప్రభుత్వం హెచ్చరిస్తుంది. అయినా కూడా ఆక్రమణలు ఆగడం లేదు అని చెప్పవచ్చును. ఎన్ఎస్పి కాల్వ హద్దులు ఏమిటి? ఆ హద్దులు ఎక్కడ వరకు ఉన్నవి, ఎక్కడ ఏ విధంగా ఎవరు ఆక్రమించుకున్నారు. ఆక్రమణకు ఎందుకు పాల్పడ్డారు అనే దానిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలి. ఎన్ఎస్పి కాల్వ ఆక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూములను రక్షించాలి. భావితరాలకు ప్రభుత్వ కాల్వ ఎంతో ఉపయోగకరం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగానూతన టెక్నాలజీతో అనువైన వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తున్న ఈ రోజుల్లో సాగునీరు అందించేందుకు కాల్వ చారా అవసరం. అలాంటి కాల్వ ఆక్రమణకు గురవుతుంది అంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. సంబంధిత అధికారులు దిద్దిపూడి సమీపంలో ఉన్న ఎన్ఎస్పి కాల్వ ఆక్రమణకు గురవుతున్న విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# వైరా మున్సిపాలిటీలో రూ.54లక్షల రికవరీ ఎప్పుడో..?




**-అధికారుల మౌనం వెనుక ఆంతర్యం ఏంటి..?**
**-నిధులు రికవరీపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..?**



ప్రజాపక్షం/వైరా : వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ నుండి వ్యక్తిగత అవసరాల కోసం రూ.54లక్షలు వాడుకున్న విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆ విషయంలో కొన్ని రోజులు జాప్యం జరిగిన తర్వాత అధికారులు ఒక్కరిపై వేటు వేశారు. ఒకరిని సస్పెండ్ చేశారు. తర్వాత విచారణ పేరుతో కాలయాపన జరుగుతూ ఉంది. దారి మళ్లిన జనరల్ ఫండ్ రూ.54లక్షల్లో రికవరీ ఎందుకు నేటి వరకు చేపట్టలేదు. నిధులు దుర్వినియోగంపై అధికారులు నామమాత్రంగా ఒకరిపై రేటు వేసిచేతులు దులుపుకున్నారు అని చెప్పవచ్చును. ప్రభుత్వ ధనాన్ని పక్కదారి పట్టించి వ్యక్తిగత అవసరాలకు మళ్లించారని సిడిఎంఎ అధికారులు వైరా వచ్చి విచారణ చేసి నిర్ధారించారు. ఆ తర్వాత ఆ నిధులు రికవరీ చేయడంలో ఎందుకు మౌనం వహించారు. ఈ మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి? వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ నుండి రూ.54లక్షలు దుర్వినియోగం జరిగిన విషయం తెలిసిన అధికారులు నేటికి ఎందుకు వాటిని రికవరీ చేయలేకపోయారు. క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించినే కూడా ఎందుకు వాటిపై చర్యలు చేపట్టలేదు. చర్యలు చేపట్టకుండా ఉండటానికి కారణం వెనక ఉన్న బాధ్యులు ఎవరు? అసలు జనరల్ ఫండ్ దుర్వినియోగంలో ఎవరెవరి పాత్ర ఉంది అనే దానిపై ఎందుకు నిగ్గు తేల్చలేకపోయారు. ఎంతమందిపేరు మీద ఎన్ని చెక్కులు వ్రాశారు. ఆ చెక్కులు వ్రాసిన వారి నుండి ఎందుకు డబ్బులు రాబట్టలేకపోయారు. ఇది అధికారుల తప్పిదమే కదా, లేదా నిర్లక్ష్యమే ఒక్కసారి ఆలోచించాలి. కార్మికులకు జీతాలు ఇవ్వడానికే రోజులు తరబడి వెనకాడే అధికారులు దుర్వినియోగం అయిన డబ్బులు రికవరీలో ఎందుకు అంత నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారు.

**మున్సిపాలిటీలో పెరుగుతున్న అవినీతి...**

వైరా మున్సిపాలిటీలో రోజురోజుకి ఏదో ఒక రూపంలో అవినీతి బయటకు వస్తూనే ఉంది. ఆ అవినీతికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని వారికి అనుకూలంగా మార్చుకొని నగదు చేసుకుంటున్నారు. రోజురోజుకు ఏదో ఒక రూపంలో డబ్బులు తీసుకున్న విషయాలు బయటకు వస్తూనే ఉన్నాయి. ఈ తప్పిదాల పట్ల సరైన చర్యలు తీసుకోకపోవడం అన్ని చెప్పవచ్చును. అవినీతి ఆరోపణలతో పక్కన పెట్టిన వారిని కూడా మున్సిపాలిటీలోకి తీసుకోవడం అవినీతికి కేంద్ర బిందువుగా మారుతూ ఉంది. రూ.54లక్షలు రికవరీ చేయమని, కేసు పెట్టమని చెప్పిన కూడా అధికారులు నిర్లక్ష్యంగా వహించారు అని చెప్పవచ్చును. ఇప్పటికైనా వైరా మున్సిపాలిటీలో దుర్వినియోగం అయిన రూ.54లక్షల జనరల్ ఫండ్ రికవరీపై అధికారులు దృష్టి సారించాలి.

# మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**- ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో అభివృద్ధి**
**- బాబు క్యాంప్ సర్పంచ్ సునావత్ కుమారి**



ప్రజాపక్షం/చుంచుపల్లి : చుంచుపల్లి మండల పరిధిలోని బాబు క్యాంపు గ్రామపంచాయతీలో నాలుగు వీధులలో సుమారు 400 మీటర్ల మిషన్ భగీరథ పైపులైన్ పొడిగింపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ సునావత్ కుమారి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ దుర్గరాశి లక్ష్మి, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపిటీసీ దుర్గరాశి వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల హామీలను వన్ బై వన్ పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్స్ జోగా అమ్ములు, తవటం మురళీకృష్ణ, ఎలదండి సదా మోహన్, సునావత్ మేక్య, దారావత్ హరిగోపాల్, తవటం కృష్ణవేణి, మైత బత్తుల శిరీష, మహమ్మద్ అఫ్రీన్, అరుణ, బాబు క్యాంప్ శాఖ కార్యదర్శి అలకొండ కోటి, యూత్ నాయకులు డింపు, కౌశిక్, స్థానిక గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఖాళీ ప్రదేశాల్లో చెత్తని వేయకండి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో శిధిలావస్థలో ఉన్న భవనాలు, ఖాళీ స్థలాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థ పదార్థాలను వేయవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో డాక్టర్ చంద్రకళ పర్యటించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఇష్టానుసారంగా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని, అలా నిబంధన అతిక్రమిస్తే మున్సిపాలిటీ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఖాళీ స్థలాలు శుభ్రం చేయకపోతే మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరుల ఆశయాలను సాధించాలి



ప్రజాపక్షం/పాల్వంచ : అమరుల ఆశయాలను సాధించటానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధి నారాయణరావుపేటలో సిపిఐ మాజీ మండల కార్యదర్శి దేవరకొండ నాగాచారి వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నాగాచారి స్మారక స్థూపానికి పూల మాలలు వేసి అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసిన అమరులను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించాలని స్పష్టం చేశారు. నాగాచారి మృతి ఆయన కుటుంబానికే కాక పార్టీకి కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అను నిత్యం ప్రజా సమస్యలపై స్పందించి పాల్వంచ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి నాగాచారి చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. త్యాగధనులు అందించిన ఎర్రజెండాను పాల్వంచ ప్రాంతంలో సగర్వంగా నిలుబెడదామని పిలుపునిచ్చారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణరావుపేట సర్పంచ్ సరస్వతి, మండల కార్యవర్గ సభ్యులు చంచలపురి శ్రీనివాసరావు, మేకా రాంబాబు, పోతుమర్తి కొమురయ్య, గంగుల సత్యనారాయణరెడ్డి, గుర్రం నాగయ్య, చింతా ప్రశాంత్, గంగుల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ రెండున జరిగే ధర్నాను విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : సమస్యల పరిష్కారం కోసం జూన్ 2న, కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుశ నాయక్ పిలుపునిచ్చారు. పాల్వంచ మునిసిపాలిటి ప్రాంగణంలో శుక్రవారం ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ద్వారా అండర్ గ్రౌండ్ మైన్స్/ఓపెన్‌కాస్ట్ మైన్స్‌తో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయను అనుకున్నప్పటికీ నిరాశే ఎదురయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో సింగరేణి సంస్థలో 1997 సమతా జడ్జిమెంట్ మరియు 1996పీసా యాక్ట్ ప్రకారం గిరిజనులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి వెంకటేశ్వర్లు, భూక్యా క్రిష్ణవేణి, బానోత్ లలిత, సుధాకర్, మహేష్, రామక్రిష్ణ, రాజేష్, ఉలవపూడి రాములు తదితరులు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక బిజేపి ప్రభుత్వం



ప్రజాపక్షం/పాల్వంచ : రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిజేపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధి రెడ్డిగూడెం గ్రామంలో కళింగరెడ్డి అధ్యక్షతన పార్టీ గ్రామ మహాసభ శుక్రవారం జిరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన నాటి నుండి సాగు రంగాన్ని ప్రధాన టార్గెట్ చేస్తూ కార్పోరేట్ శక్తులకు అప్పగించటం కోసమే నూతన చట్టాలను తీసుకొస్తుందని ఆరోపించారు. కార్పోరేట్ శక్తుల సూచనల మేరకే మనదేశంలో పంటలు పండించే దుస్థితి దాపురిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పండించిన పంటలు తడిసిపోయి మార్కెట్‌లో నిల్వ చేసుకొనే సదుపాయాలు లేక దళారులకు విక్రయిస్తూ రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. పాలక ప్రభుత్వాలు తక్షణమే పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందాళ బుచ్చిరెడ్డి, ఉప్పరబోయిన రాంమూర్తి, బత్తుల నాగరాజు, కొమరం మల్లేష్, తూము రాజమ్మ, ముత్తమ్మ, మణెమ్మ,అంజలి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.